క్లుప్తంగా

ప్రారంభమైన జూనియర్ కళాశాలలు

అశ్వారావుపేటరూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, మైనార్టీ జూనియర్ బాలికల కళాశాలలు గురువారం నుంచి తిరిగి పునఃప్రారంభం అయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు వేసవి సెలవులు ముగిసిన నేపథ్యంలో ఇంటర్ తరగతులను ప్రారంభించినట్లు జూనియర్ కళాశాల, మైనారిటీ కళాశాల ప్రిన్సిపాల్ సాగర్, కె.లిల్లీ సుజన్ సారాలు వేర్వేరుగా తెలిపారు. కాగా తొలి రోజు విద్యార్థులు తక్కువ సంఖ్యలో హాజరు కావడంతో స్థానిక కళాశాలలు వెలవెలబోయాయి.

ముగిసిన క్రికెట్ పోటీలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని అనంతారం గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలు గురువారం ముగిశాయి. స్థానిక రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్లకు గురువారం ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ట్రోఫీతోపాటు, బహుమతులు అందించారు. అలాగే టీమ్ సభ్యులు, నిర్వాహకులకు, యూత్ బాధ్యులకు జ్ఞాపికలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బరగడ కృష్ణారావు, సర్పంచ్ దాసరి నాగేంద్రరావు, ఎంపీటీసీ, బీఆర్ఎస్ నాయకులు మందపాటి మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు త్వరలో పట్టాలు పంపిణీ

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువు, మామిళ్లవాయి గిరిజన గ్రామాల్లో 71, 27 సర్వే నంబర్లలో రైతుల సాగు భూముల విషయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన తప్పులను సరిచేస్తూ త్వరలో రైతులకు పట్టాలు పంపిణీ చేస్తామని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు గురువారం సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించారు. తుమ్మలచెరువు, మామిళ్లవాయి గ్రామాల్లో 71, 27 సర్వే నంబర్లలోని రైతులు పూర్తి వివరాలతో ఈ నెల 6న మధ్యాహ్నం 2గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో హాజరు కావాలని ఆయన కోరారు. ఎమ్మెల్యే రేగా కాంతారావు చొరవతో గిరిజన రైతులకు పట్టాలకు మంజూరు అవుతున్నాయని జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ తెలిపారు.

గర్భిణులు పోషకాహారాన్ని తీసుకోవాలి

అశ్వారావుపేటరూరల్: గర్భిణులు, బాలింతలు పోషకాలతో ఉండే ఆహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ) సుప్రియ సూచించారు. మండలంలోని ఆసుపాక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం వీహెచ్ఎస్ఎన్‌సీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు వైద్యులను సంప్రదించి, ఐరన్, విటమిన్లు ఉండే మాత్రలను వాడాలన్నారు. అధిక పోషకాలు ఉండే కూరగాయాలు, ఆకు కూరలతోపాటు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. సమావేశంలో కార్యదర్శి మోతీలాల్, ఏఎన్ఎం లక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి


చర్ల: ఏడాది కాలంలో కార్మికులు చేసిన ఉపాధిహామీ పనులకు వేతనాలు వెంటనే చెల్లించాలని ప్రజాసంఘాల నాయకులు మర్మం చంద్రయ్య, ఎలమంచి వంశీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం దుమ్ముగూడెం మండలంలోని గంగోలులో ఉపాధిహామీ పనులు కొనసాగుతున్న ప్రాంతాన్ని వారు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. అందులో భాగంగా గత ఏడాది చేసిన కూలీ పనులకు సంబంధించి ఇంత వరకు వేతనాలు రాలేదని లక్ష్మీనగరం, ములకపాడు గ్రామాలకు చెందిన కూలీలు వారి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఏ రోజు పనులకు ఆరోజే కూలీ వేతనాల స్లిప్పులను అందించాలని, పనుల్లోని నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ములకపాడు సర్పంచ్ కల్లూరి దేవి, నాయకులు కల్లూరి లక్ష్మయ్య, పొడియం బాలరాజు. గోపాలకృష్ణ, పాపారావు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ, కన్వర్టెడ్ ఆశ్రమ, ప్రాథమిక పాఠశాలల్లో విద్యా సంవత్సరం ఆరంభానికి ముందే ఉపాధ్యాయులను నియమించాలని టీపీటీఎఫ్ నాయకులు ఇన్‌చార్జ్ గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు డేవిడ్ రాజుకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు బుటారి రాజు, ఉపాధ్యాయ దర్శిని సంపాదకవర్గ సభ్యుడు మునిగడప రామాచారిలు మాట్లాడుతూ.. ప్రస్తుతం అమలులో ఉన్న డిప్యూటేషన్లను సమీక్షించాలని, భవిష్యత్తులో డిప్యూటేషన్లు పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. అదేవిధంగా స్పోర్ట్స్ ఆఫీసర్‌ను నియమించాలని, ప్రతిపే సెంటర్ ఆశ్రమ పాఠశాలలకు క్లర్కును నియమించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డేవిడ్ రాజ్ హామీ ఇచ్చారు.

ఏజెన్సీలో అగ్గిపుడితే బుగ్గే..

- అందుబాటులో లేని అగ్నిమాపక కేంద్రం
- సకాలంలో చేరుకోని ఫైరింజన్
- కాలిబూడిదవుతున్న ఆస్తులు



అగ్ని ప్రమాదంలో దగ్ధమవుతున్న ఇళ్లు (ఫైల్)



మంటలు ఆర్పేందుకు స్థానికుల ప్రయత్నం (ఫైల్)

దుమ్ముగూడెం: భద్రాచలం డివిజన్‌లోని పూర్తి ఏజెన్సీ మండలమైన దుమ్ముగూడెంలో అగ్నిప్రమాదం సంభవిస్తే క్షణకాలంలో అంతా బుగ్గిపాలవుతోంది. అయినప్పటికీ పాలకులు గానీ, అధికారులు గానీ మండల కేంద్రంగా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నాలు చేయకపోవడం విస్మయం కలుగజేస్తోంది.

మండలంలోని 37 పంచాయతీల్లో 114 గ్రామాలు ఉన్నాయి ప్రతీ ఏడాది ఎండాకాలంలో పలు అగ్ని ప్రమాదాలు సంభవించి బాధితులు కట్టుబట్టలతో మిగులుతున్నారు. ఏజెన్సీ గ్రామాల్లో ఎక్కువ శాతం గడ్డి ఇళ్లు, తాటాకు ఇళ్లు ఉంటాయి .వీటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లు, ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి మంటలు ఇంటిని చుట్టు ముడుతున్నాయి. భద్రాచలంలో ఉన్న అగ్నిమాపక కేంద్రం నుంచి ఫైరింజన్ ఘటన స్థలానికి చేరుకునే లోపే అంతా బూడిదవుతోంది. బాధితులు ఇంటి సామగ్రి, బంగారం, నగదు, ధాన్యం, పట్టాభూముల పుస్తకాలు, ఆధార్ కార్డులు, విలువైన కాగితాలు కోల్పోతున్నారు. భద్రాచలం నుంచి వచ్చే ఫైరింజన్ పక్క ఇంటికి మంటలు వ్యాపించకుండా చేసేందుకు తప్పా మంటలను ఆరేందుకు ఉపయోగపడడం లేదు.

46 నిమిషాల పైబడి ప్రయాణం..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అగ్నిప్రమాదం సంభవించిన ప్రాంతానికి ఫైరింజన్ వెళ్లేటప్పుడు అగ్నిమాపక కేంద్రం నుంచి రెండు నిమిషాలకు కిలో మీటర్ వేగంతో వెళ్లాలి. ఆ చొప్పున భద్రాచలం నుంచి దుమ్ముగూడెం మండల కేంద్రానికి 23 కిలో మీటర్లు అంటే మండల కేంద్రానికి ఫైరింజన్ వాహనం రావడానికి సుమారు 46 నిమిషాలు పడుతుంది. అక్కడి నుంచి మారుమూల గ్రామాలకు ఫైరింజన్ వెళ్లేసరికి అక్కడ పొగ, బూడిద తప్పా ఏమీ మిగలడం లేదు. దుమ్ముగూడెం మండలం వరకే పరిస్థితి ఇలా ఉంటే ఇంకా చర్ల, వెంకటాపురం మండలాల్లో అగ్నిప్రమాదాలు సంభవిస్తే భద్రాచలం నుంచి ఫైరింజన్ ఘటన స్థలానికి వెళ్లడానికి ఎంత సమయం పడుతుందో చెప్పనక్కర లేదు.

ఈ సంవత్సరం ఘటనలెన్నో..

ఈ ఏడాది ఇప్పటికే ధర్మారం గ్రామంలో సంభవించిన అగ్నిప్రమాదంలో అన్నదమ్ములకు చెందిన 4 ఇళ్లు కాలిపోయాయి. అలాగే పెద్దకమాలాపురం గ్రామంలో రెండు ఇళ్లు, దుమ్ముగూడెం గ్రామంలో ఒక ఇల్లు అగ్ని ప్రమాదాలకు గురై బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందజేసే రూ.8వేలు కూడా ఎప్పటికి వస్తాయో తెలియని పరిస్థితి.

కేంద్రం ఏర్పాటుకు చిత్తశుద్ధి ఏది?

మండలంలోని రాజకీయ పార్టీల నాయకులు అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నాలు చేయకపోవడం ఆవేదన కలుగజేస్తోందని ప్రజలు వాపోతున్నారు. ప్రమాదం సంభవించినప్పుడు వచ్చి పరామర్శించి నిత్యావసరాలు అందజేసి పోతున్నారు తప్పా శాశ్వత పరిష్కారానికి పూనుకోవడం లేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు, రాజకీయపార్టీల నాయకులు మండలంలో ఫైరింజన్ ఏర్పాటుకు ప్రయత్నించాల్సి ఉంది.

విన్నవించినా ఫలితం శూన్యం



భద్రాచలం డివిజన్‌లోని పూర్తి ఏజెన్సీ పరిధిలోకి వచ్చే మండలాల్లో ప్రతి ఏటా ఎండకాలంలో అగ్నిప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రజలు ఆస్తులను కోల్పోయి కట్టుబట్టలతో మిగులుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించాం. అయినప్పటికీ ఫలితం మాత్రం కనిపించడం లేదు. ప్రభుత్వం స్పందించి మండల కేంద్రంగా అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

– పొదెం వీరయ్య, భద్రాచలం ఎమ్మెల్యే

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు



కరకగూడెం: సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి

కరకగూడెం: మండలంలోని తాటిగూడెం గ్రామంలో ఏపీజీవీబీ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ వి.రామిరెడ్డి సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. బ్యాంకింగ్ సేవలలో పొదుపు, రుణం తీసుకోవడం, డిజిటల్ సేవలను వినియోగించుకోవడం, ఆన్‌లైన్ మోసాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పీఎంజేజేవై, పీఎంఎస్‌బీవై, భీమా పథకాలను అతితక్కువలో పొందవచ్చని తెలిపారు. అనంతరం ఏ బ్యాంకు సిబ్బంది కూడా ఖాతాదారుడి వివరాలనుగానీ, ఓటీపీ, లోన్ వచ్చిందని కాని ఫోన్ చేయరని, అలా ఎవరైన ఫోన్ చేసి వివరాలు అడిగిన, సైబర్ క్రైమ్ జరిగినా వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి కేసు నమోదు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కరకగూడెం ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ అనీల్ కుమార్, ఉపసర్పంచ్ జాడి నాగరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలు తొలగించాలి



డీఈ జీవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ శారద, నాయకులు

అశ్వాపురం: మండల కేంద్రంలో జగదాంబ స్వీట్స్ షాపు నుంచి జెడ్పీ స్కూల్ వరకు విద్యుత్ స్తంభాలు తొలగించి నూతనంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ.. సర్పంచ్ బాణోత్ శారద ఆధ్వర్యంలో డీఈ జీవన్‌కుమార్, ఏఈ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. సమస్య పరిష్కరించాలని గురువారం సర్పంచ్ శారద ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్ ఎదుట ధర్నాకు సిద్ధం కాగా సమాచారం అందుకున్న డీఈ జీవన్‌కుమార్ సర్పంచ్ శారద, నాయకులతో మాట్లాడి ఐదు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ శారద మాట్లాడుతూ.. జగదాంబ స్వీట్స్ షాపు నుంచి జెడ్పీ స్కూల్ వరకు ఓ పక్క సైడ్ డ్రెయినేజీ నిర్మించేందుకు ఎంపీపీ సుజాత నిధులు చేశారని, నిర్మాణానికి విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉన్నాయని అన్నారు. వాటిని తొలగించి నిర్మాణం పూర్తయ్యాక కొత్తగా అమర్చేందుకు శాఖకు రూ.1,82,000లను గ్రామ పంచాయతీ నుంచి చెల్లించామన్నారు. కొత్త స్తంభాలు లేని అధికారులు జాప్యం చేస్తున్నారని, దీనివల్ల వర్షాలు వస్తే డ్రెయినేజీ నిర్మించటం కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఆదివాసీ మహిళలకు సీమంతం



గర్భిణులతో వైద్య సిబ్బంది, జవ్వాదీయులు

చర్ల: మండలంలోని రాళ్లాపురం ఆదివాసీ గ్రామంలో గురువారం గర్భిణులకు చర్లకు చెందిన జవ్వాది కుటుంబీకుల ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ సూచన మేరకు గ్రామంలోని 12 మంది గర్భిణులకు సాంప్రదాయబద్ధంగా సీమాంతాలు నిర్వహించి పసుపు, కుంకుమలు, నూతన వస్త్రాలు, పండ్లు, గాజులు వంటివి అందజేశారు. డాక్టర్ దివ్యనయన, డాక్టర్ మోనిక, డాక్టర్ శిరీష, ఐసీడీఎస్ సీడీపీఓ చైతన్య, డీపీఎంఓలు చింతా సత్యనారాయణ, ఆదెపు ముత్యాలరావు, హెచ్ఈ వేణుగోపాల్, సూపర్‌వైజర్లు, వెంకటనర్సమ్మ, పుష్పావతి, ప్రసాద్, జవ్వాది జయబాబు, నాగేంద్రబాబు, యోగేంద్రబాబు, మురళీకృష్ణ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరావు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణపై పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏజే రమేష్

భద్రాచలంఅర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, నూతన విద్యుత్ చట్టం రద్దు కోసం పోరాటాలు నిర్వహించాలని, అందుకోసం అన్ని స్థాయి కార్మికులు, ఉద్యోగులను ఐక్యం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే.రమేష్ పిలుపునిచ్చారు. తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (యూఈఈయూ) జిల్లా సమావేశంలో ఏజే రమేష్ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగం మొత్తాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి నూతన విద్యుత్ చట్టం తీసుకొచ్చిందని, దీనివల్ల ప్రజలకు వివిధ రూపాల్లో అందుతున్న విద్యుత్ సబ్సిడీలు మొత్తం దూరం అవుతాయని అన్నారు. విద్యుత్ రంగంలో పనిచేస్తున్న లక్షలాదిమంది ఉద్యోగులు, కార్మికుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి యూనియన్ భద్రాచలం డివిజన్ కార్యదర్శి పదిలం శ్రీనివాస్ అధ్యక్షత వహించగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి, యూనియన్ జిల్లా కార్యదర్శి బొల్లివెంకటరాజు, యూనియన్ నాయకులు శ్రీను, సీతారాములు, పి. శంకర్ వర్మ, కనుకు సత్యనారాయణ, జగన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే చేరండి

మణుగూరురూరల్: నాణ్యమైన విద్యకు చిరునామాగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే చేరాలని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.శ్రీనివాస్ కోరారు. తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. అనుభవజ్ఞులైన అధ్యాకులచేత విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. కళాశాలలో చేరదలచిన విద్యార్థులు కుల, ఆదాయ, టీసీ, ఎస్సెస్సీ, ఇంటర్ ధ్రువీకరణ పత్రాలతో దోస్త్ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. దోస్త్ మొదటి దఫా ప్రవేశాలకు ఈ నెల 10వ తేదీ వరకు అవకాశం ఉందని, రిజిస్ట్రేషన్ ఫీజ్ రూ.200 మాత్రమేనన్నారు. విద్యార్థులు వెంటనే నమోదు చేసుకుని కళాశాలలో సంప్రదించాలని కోరారు.

'ధరణి'పై దృష్టి సారించాలి

ములకలపల్లి: ధరణి పోర్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని హైకోర్టు న్యాయవాది, సాదిక్ ఫౌండేషన్ చైర్మన్ సాధిక్ అలీ అన్నారు. ధరణి పోర్టల్‌పై ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్యంగా చేపడుతున్న అధ్యయనంలో భాగంగా గురువారం మండలపరిధిలోని పూసుగూడెం గ్రామాన్ని సందర్శించారు. ఫౌండేషన్ సభ్యులు స్థానిక రైతులతో మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు. ఈసందర్భంగా చైర్మన్ సాధిక్ అలీ మాట్లాడారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించి, రైతులకు పోడు పట్టాలివ్వాలని అన్నారు.

కరపత్రాల పంపిణీ

దమ్మపేట: కాంగ్రెస్ పార్టీ కరపత్రాలను ములకలపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు సున్నం నాగమణి ఉపాధి హామీ కూలీలకు పంపిణీ చేశారు. గురువారం మండల పరిధిలోని మద్రిగూడెం, గణేష్‌పాడు గ్రామాలలో ఉపాధి హామీ పనిచేస్తున్న కూలీల వద్దకు వెళ్లిన ఆమె.. కరపత్రాలను అందజేసి, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టబోయే సంక్షేమ పథకాలను వివరించారు. వరంగల్ రైతు డిక్లరేషన్, హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ల ప్రాధాన్యతను కూలీలకు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మద్దిశెట్టి సత్యప్రసాద్, యర్రగొర్ల క్రుష్ణ, బేతిని నాగేశ్వరరావు, చీకటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

చంద్రుగొండ: మండలంలో నెలకొన్న ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అతవాలే) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దిశెట్టి సామేలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పేదలతో కలిసి గురువారం ఆయన ఇక్కడ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నకు సమస్యలతోకూడిన మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా సామేలు మాట్లాడుతూ.. ఇళ్లులేని పేదలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గ్రామాల్లో ఇళ్లు లేనివారికి ఇళ్ల స్థలాలు, స్థలాలు ఉన్న వారికి ఇళ్లు కట్టుకునేందుకు నగదు ఏకకాలంలో ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన, గిరిజనేతర పేదలందరికీ పోడుభూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కుంజా నాగేంద్రబాబు, పద్దం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

102 శాతం వార్షిక బొగ్గు ఉత్పత్తి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏరియా జీఎం రాంచందర్

మణుగూరురూరల్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా మే మాసానికి నిర్దేశించిన లక్ష్యానికి గానూ 122 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు ఏరియా జీఎం దుర్గం రాంచందర్ తెలిపారు. గురువారం ఏరియా జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఉత్పత్తి, ఉత్పాదకతల వివరాలను వివరించారు. మే నెలకు ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యం 10లక్షల 18వేల 500 టన్నులకు గాను 12 లక్షల 40వేల 452 టన్నులతో 122 శాతం ఉత్పత్తిని సాధించామన్నారు. మే నెల ఓబీ వెలికితీత లక్ష్యం 15 లక్షల క్యూబిక్ మీటర్లకు గాను 13.76 లక్షల క్యూబిక్ మీటర్లతో 92 శాతం నమోదం చేసినట్లు వివరించారు. మే నెలలో మొత్తంగా 12లక్షల 56వేల 141 టన్నుల బొగ్గు రవాణా చేసినట్లు తెలిపారు. బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతల లక్ష్య సాధనకు ఉద్యోగులు, అధికారులు, సూపర్‌వైజర్లు, కార్మిక సంఘాల నాయకులు సమష్టిగా కృషే కారణమని, ఇందుకు వారందరికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. సమావేశంలో ఏరియా ఎస్వోటు జీఎం డి.లలిత్‌కుమార్, ఏజెంట్ కేపీయూజీ నాగేశ్వరరావు, ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, ఇంజనీర్ నర్సిరెడ్డి, డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్, మణుగూరు ఓసీ పీఓ శ్రీనివాసచారి, డీజీఎం ఐఈడీ వెంకట్రావు, డీవైసీఎంఓ మేరికుమారి, ఫినాన్స్ మేనేజర్ అనురాధ, సీనియర్ ఎస్టేట్స్ అధికారి బాబుల్ రాజ్, సీనియర్ సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్, సీనియర్ పర్సనల్ అధికారి ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు పనులు పరిశీలన



పెదవాగు ప్రాజెక్టు గేట్ల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి వద్దఉన్న పెదవాగు ప్రాజెక్ట్‌ను గురువారం స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సందర్శించారు. ప్రాజెక్ట్ మూడు గేట్లను రూ.1కోటి 10లక్షల వ్యయంతో మరమ్మతులు చేస్తుండగా, ఈ పనులను పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. పనులను వచ్చే వానాకాలం నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే..

మండలంలోని గుమ్మడవల్లి సమీపంలోని పెదవాగు ప్రాజెక్ట్ వద్ద నూతనంగా నిర్మించిన గంగానమ్మ తల్లి ఆలయంలో గురువారం శీతలాంబాదేవి (బొడ్రాయి), గంగానమ్మ, పోతురాజుల విగ్రహ ప్రతిష్ఠలు చేశారు. అదే విధంగా ఆలయం ఎదుట జీవధ్వజ స్తంభం ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు నిర్వహించగా.. ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హాజరయ్యారు. అనంతరం మధ్యాహ్న సమయంలో భక్తులకు మహా అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించగా, భక్తులు పాటిత్తారు.

దమ్మపేట: మండల పరిధిలోని జగ్గారం గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి, విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు. గురువారం జగ్గారం గ్రామంలో సీతారామస్వామి, నాభిశిల, ముత్యాలమ్మ, పోతురాజుల ప్రతి కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని, స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం మండల పరిధిలోని పలు శుభకార్యాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, దారా యుగంధర్, కొయ్యల అచ్యుతరావు, యార్లగడ్డ బాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి

ములకలపల్లి: ప్రభుత్వ భవనాలు, రోడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని ఎర్రప్పగుంపు మూకమామిడి గ్రామాల మధ్య రూ.58 లక్షల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సదర్భంగా మాట్లాడుతూ.. మారుమూల గ్రామాలకు మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్లాది రూపాయలను వెచ్చిస్తోందని అన్నారు. సకాలంలో నాణ్యతాయుతంగా పనులను పూర్తి చేయాలని సూచించారురు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపూడి అప్పారావు, ఎంపీపీ మట్ల నాగమణి, సర్పంచ్ కారం సుధీర్, సొసైటీ డైరెక్టర్ అనుమల సత్యనారాయణ, నందమూరి సురేశ్, కొండవీటి రాజారావు తదితరులు ఉన్నారు.

ఏం చేశారని దశాబ్ది ఉత్సవాలు?

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రాంతాన్ని పూర్తిగా విస్మరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.. ఏదో మేలు చేసినట్లు దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేయడం విడ్డూరంగా ఉందని భద్రాచలం శాసనసభ్యుడు, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఏర్పాట్లు సాగుతున్న నేపథ్యంలో ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2014లో సీఎం కేసీఆర్ తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే భద్రాచల నియోజకవర్గంలోని 5 మండలాలను ఏపీలో మిలినం చేశారని ప్రకటనలో విమర్శించారు. భద్రాచలం శాసనసభ్యుడిగా తాను ఎన్నో పర్యాయాలు అసెంబ్లీలో ఇక్కడ ప్రజల బాధను వివరించినప్పటికీ ముఖ్యమంత్రి పట్టించుకోలేదన్నారు. భద్రాద్రి రామాలయం అభివృద్ధికి రూ.100కోట్లు అని ప్రకటించి, 1000 కోట్లు వెచ్చించి కరకట్టను ప్రతిష్ట పరిచి వరదల నుంచి శాశ్వత పరిష్కారాన్ని చూపెడతామని చెప్పిన ముఖ్యమంత్రి మాటలు నీటి మీద రాతలుగానే మిగిలాయని ఎమ్మెల్యే పొదెం విమర్శించారు. భద్రాచలం ప్రాంతం నుంచి తరలిపోయిన ఎంపీడీఓ, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, భారీ నీటిపారుదల శాఖ ఆఫీసులను మళ్లీ తిరిగి ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన తర్వాతే భద్రాచల ప్రాంతంలో శతాబ్ది ఉత్సవాలు జరపాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. కరకట్ట పొడవును పెంచి కరకట్టను ప్రతిష్టపరిచి, గోదావరి వరదల నుంచి భద్రాచలం నియోజకవర్గ ప్రజలకు శాశ్వత పరిష్కారం మీరు చూపెట్టిన తర్వాతే ఉత్సవాలు జరపాలన్నారు.

ఉత్సవాలను జయప్రదం చేయండి

చంద్రుగొండ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాల్సిందిగా మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు.

వేడుకల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఉత్సవాల్లో భాగంగా జాతీయ జెండావిష్కరణలు, రైతువేదికల వద్ద రైతుదినోత్సవం ఏర్పాటు చేశామని అన్నారు. తహసీల్దార్ వర్ష రవికుమార్, ఎంపీడీఓ రేవతి, రైతుబంధు మండల కన్వీనర్ గాదే లింగయ్య, ఎంపీఓ తోట తులసీరాం, వివిధ శాఖాధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పీఏసీఎస్ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు అన్నారు. గురువారం పీఏసీఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సహకార సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, సేవా కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. సమావేశంలో మానిటరింగ్ అధికారి సుజాత,ఏఓ శంకర్, సీఈఓ ప్రసాద్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబు



విద్యుత్ వెలుగులతో బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయం

బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలకు మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. విద్యుత్ కాంతుల వెలుగులతో ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు కొత్తశోభను సంతరించుకున్నాయి. బూర్గంపాడులోని తహసీల్, మండల పరిషత్, పోలీస్ స్టేషన్‌లు విద్యుత్ కాంతులతో మిరుమిట్లుగొలుపుతున్నాయి.

అశ్వారావుపేటరూరల్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం రాత్రి ప్రభుత్వ కార్యాలయాలకు, రింగ్ రోడ్ వద్ద విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం, తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్ స్టేషన్ భవనాలతోపాటు, తెలంగాణ తల్లి విగ్రహానికి, స్థానిక రింగ్ రోడ్డు చూట్టు రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ విద్యుత్ దీపాలకరణలతో ఆయా కార్యాలయాలు, రింగ్ రోడ్ సెంటర్ కళకళలాడుతున్నాయి.